క్లుప్తంగా

మహిళా సాధికారతపై చర్చ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీఓ అనురాధ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మహిళా సాధికారత అనే అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఏలూరు హేలాపూరి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ పీవీ రమణ ఆధ్వర్యంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం శేఖర్‌బాబు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా పంచాయతీ అధికారి కొడాలి అనురాధ హాజర య్యారు. విశిష్ట అతిథులుగా సీఆర్ఆర్ కాలేజ్ అధ్యాపకురాలు ఎస్ హేమలత, సెయింట్ ఆ న్స్ కాలేజ్ అధ్యాపకురాలు పి.జ్యోతి కుమారి, లయన్స్ క్లబ్ ప్రతినిధి కె.విష్ణు ప్రియ పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలు అందించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కార్పొరేషన్ ద్వారా ఎస్సీలకు సబ్సిడీ రుణాలు అందించాలని దళిత సేన ఏలూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ కోరారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సంఘం కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన ఏలూరు జిల్లా, ఏలూరు నగరం మహిళా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవి ప్రకాష్ నాయకత్వంలో మాలల అభివృద్ధికి సమర్థవంతంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. ఇటీవల మాలల కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన పెదపూడి విజయ్ కుమార్‌కి శుభాకాంక్షలు తెలిపారు. మాలల ఆర్థిక అభివృద్ధికి విజయ్ కుమార్ కృషి చేయాలని కోరారు. ఏలూరు నగర మహిళా అధ్యక్షురాలు పిల్లి దుర్గ, కార్యదర్శి హారిక ప్రధాన కార్యదర్శి కృష్ణ వేణి, మహిళా కార్యకర్త లు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై అవగాహన కల్పించాలి



వాల్‌పోస్టర్‌ను విడుదల చేసిన జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు(మెట్రో): వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్ల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. డబ్ల్యూఎస్ఎం (డిస్ట్రిక్ట్ వాటర్ శానిటేషన్ మిషన్) జిల్లా స్థాయి కమిటీ సమావేశం జేసీ అధ్యక్షతన మంగళవారం స్థానిక కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో నిర్వహించారు. కమిటీకి కన్వీనర్‌గా ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ వ్యవహరించగా, మరో 10 శాఖల జిల్లా అధికారులు కమిటీలో సభ్యులుగా ఉన్నట్టు జేసీ ప్రకటించారు. వ్యక్తిగత పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగంపై డబ్ల్యూఎస్ఎం ప్రచురించిన అవగాహన వాల్ పోస్టర్‌ను జేసీ విడుదల చేశారు. వరల్డ్ టాయిలెట్ డేను పురస్కరించుకుని మంచి పారిశుద్ధ్య సేవలు అందిస్తున్న పలువురు క్లాప్ మిత్రులను జేసీ సత్కరించారు. ఈ నెల 19 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు వ్యక్తిగత, సామాజిక మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జేసీ ఆదేశించారు. డిసెంబర్ 5 నుంచి 9వ తేదీ వరకు పరిశుభ్రమైన మరుగుదొడ్లను గుర్తించి నిర్వహణ, పర్యవేక్షణపై అవార్డులు ప్రదానం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రినాథ్ బాబు, డీఆర్‌డీఏ పీడీ ఆర్ విజయరాజు, ట్రాన్స్‌కో ఏస్ఈ పి.సాల్మన్‌రాజు, డీపీఓ అనురాధ, ఐసీడీఎస్ పీడీ కె.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

హమాలీలపై చిన్నచూపు

కూలీ రేట్లు పెంచాలని ఆందోళన



పాతూరు గోదాం వద్ద నినాదాలు చేస్తున హమాలీలు

ఏలూరు రూరల్ : రాష్ట్ర పౌర సరఫరా సంస్థ హమాలీలపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టింది. కూలీ రేట్లు పెంచాలని కోరినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. నెలలు గడుస్తున్నా ప్రభుత్వ తీరు మారకపోవడంపై హమాలీలు ఆందోళన బాట పట్టారు. ప్రభుత్వ తీరు ఎండగడుతూ మంగళవారం ఏలూరు నగరం మార్కెట్‌యార్డ్‌లో హమాలీలు సివిల్ సప్లయిస్ గొడౌన్ల వద్ద ఆందోళన చేశారు. ప్రస్తుత కూలీ రేట్లకు బతుకు బండి లాగడం కష్టంగా ఉందని.. కూటమి ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ల తరబడి ఒకే కూలికి పని చేస్తున్నామని వాపోతున్నారు. ప్రభుత్వం తమ డిమాండ్లు అంగీకరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని జిల్లా పౌర సరఫరాల సంస్థ హమాలీల సంఘం అధ్యక్షుడు శేఖర్ అన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ఏలూరు, జంగారెడ్డిగూడెం, ధర్మాజీగూడెం, పాతూరు, కుకునూరు, కేఆర్‌పురం, కైకలూరు, నూజివీడు పాయింట్లలో పని చేస్తున్న కూలీలు అవస్థలు పడుతున్నారని ఆవేదన చెందుతున్నారు.

కూలి రేట్లు పెంచాలి



ప్రతి రెండేళ్లకు కూలీ రేట్లు పెంచాలి. క్వింటాకు రూ.3 నుంచి రూ.6 వరకు ఉంటుంది. 2023 డిసెంబర్ నాటికి అగ్రిమెంట్ పూర్తయ్యింది. గత ప్రభుత్వం కూలీ పెంచే సమయానికి ఎన్నికల కోడ్ వచ్చింది. ఆరు నెలలుగా కూలీ రేట్లు పెంచాలని కోరుతున్నా మా గోడు వినడం లేదు.

వి.యోహాన్, హమాలీ

దసరా బోనస్ పెంచలేదు



ప్రభుత్వం మా డిమాండ్లు పట్టించుకోవడం లేదు. ఏటా ప్రభుత్వం దసరా బోనస్ రూ.6 వేల నగదుతో పాటు స్వీట్లు ఇస్తారు. బోనస్ పెంచాలని కోరాం. అయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగానే బోనస్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

బి.రవి, హమాలీ

కుట్టు కూలీ పెంచడం లేదు



ఏటా ప్రభుత్వం మూడు జతల బట్టలు ఇస్తుంది. ఇవి కుట్టుంచుకునేందుకు రూ.2,100 ఇస్తారు. కుట్టు కూలీ పెంచాలని ప్రభుత్వాన్ని కోరాం. కూలి పెంచలేదు సరికదా.. ఈ ఏడాది దసరాకు బట్టలు కూడా లేవు.

డి.ప్రభుదాసు, హమాలీ

30 వరకు చైతన్య సభలు



చైతన్య సభల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశభక్తి – భారత రాజ్యాంగం పేరుతో మంగళవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు 12 రోజులపాటు చైతన్య సభలు హేలాపురి బాలోత్సవం, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం, భారత బచావో సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు తెలిపారు. తొలి కార్యక్రమాన్ని స్థానిక కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో, ప్రభుత్వ బాలికల హైస్కూల్లో ప్రారంభించారు. ఈ సందర్భంగా నరసింహారావు, భారత బచావో ప్రతినిధి బోఫ రాంబాబు, హేలాపురి బాలోత్సవం కమిటీ నాయకులు ఎస్ రవి, డి.శివప్రసాద్‌లు మాట్లాడుతూ ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామ నాయకురాలు ధీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి గురించి వివరించారు. ఈనెల 20న బాలల హక్కుల దినోత్సవం, 21న సీవీ రామన్ వర్ధంతి, 25న స్త్రీలపై హింస వ్యతిరేక దినోత్సవం, పైడిమర్రి వెంకట సుబ్బారావు రచించిన ప్రతిజ్ఞ అమల్లోకి వచ్చిన రోజు, 25న స్త్రీలపై హింస వ్యతిరేక దినోత్సవం, 26న రాజ్యాంగ దినోత్సవాలను నిర్వహిస్తామని తెలిపారు. 28న జ్యోతిరావు పూలే 134 వర్ధంతి, ఫ్రెడరిక్ ఏంగెల్స్ జయంతి, 30న గురజాడ అప్పారావు 109వ వర్ధంతి పురస్కరించుకుని వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కస్తూర్బా స్కూల్లో జరిగిన సభకు ప్రధానోపాధ్యాయురాలు జి.సునీత ప్రభుత్వ బాలికల పాఠశాలలో జరిగిన సభకు ప్రధానోపాధ్యాయుడు శ్రీరామ్ అధ్యక్షత వహించారు. ఆయా పాఠశాల టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ముగిసిన సర్టిఫికెట్ కోర్సు



శిక్షణ ముగింపు సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏరువాక కేంద్రం, ఏలూరు, సమేతి, మేనేజ్ సంయుక్తంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ ప్రతినిధులకు సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజులు పాటు నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు మంగళవారం ముగిసింది. ఏరువాక కేంద్రం వారు ఏలూరులో ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం పరిశోధన సహ సంచాలకులు టి.శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ కోర్సును సద్వినియోగం చేసుకొని రైతులు సేంద్రియ, రసాయనిక ఎరువులు సమపాలనలో వేసుకుని భూసారాన్ని పెంచి అధిక దిగుబడులు సాధించే విధంగా తీర్చిదిద్దాలని సభ్యులకు సూచించారు. సొసైటీలు నిరంతరంగా రైతులకు మేలైన సేవలు అందించాలన్నారు. ఏలూరు ప్రధాన శాస్త్రవేత్త, సమన్వయకర్త కె.ఫణి కుమార్ ఈ కోర్సులో 15 రోజుల్లో నేర్చుకున్న అంశాలను వివరించారు. జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా మాట్లాడుతూ కౌలు రైతుల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి ఎస్ రామ్మోహన్ డ్రిప్ పద్ధతిని అలవర్చుకుని ఉద్యాన పంటలలో నీటి వినియోగం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త ఎస్ నాగేంద్రబాబు, పీఏసీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

రజక వృత్తి చెరువుల సర్వే చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కట్లయ్య

ఏలూరు (టూటౌన్): రజక వృత్తిదారుల చెరువులను సమగ్ర సర్వే చేయించి హద్దులు నిర్ణయించి, లీజులు నిర్ధారించాలని రాష్ట్ర రజక సంఘ ప్రధాన కార్యదర్శి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక జన సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. స్థానిక జిల్లా రజకజన సంఘ కార్యాలయంలో మంగళవారం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. ద్వారకాతిరుమల, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం మండలం నుంచి రజకు విచ్చేసి తమ సమస్యలపై మాట్లాడారు. గ్రామాల్లో రజకుల వృత్తి చెరువులు ఆక్రమణలో ఉన్నాయని, రజకుల చెరువులు లీజు విధానంలో కొన్నిచోట్ల ఎక్కువ లీజుల కారణంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా కట్లయ్య మాట్లాడుతూ జీఓ 49 ప్రకారం చెరువుల లీజు నిర్ధారించేటప్పుడు తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో చెరువుల విస్తీర్ణాన్ని కొలతలు వేసి పరిగణలోనికి తీసుకోవాలని కోరారు. కొయ్యలగూడెం మండలం బయ్యనగూడెంలో రజకుల కేటాయించిన పరమేశ్వరి చెరువు వద్ద నిర్మించిన విశ్రాంతి భవనం శిథిలమైందన్నారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 200 విశ్రాంతి భవనాలు శిథిలావస్థలో ఉన్నాయని, గతంలో ఇచ్చిన ప్రభుత్వం జీఓ ప్రకారంగా ప్రతి విశ్రాంతి భవనానికీ మూడు లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొమ్మంటి మురళి, జిల్లా ఉపాధ్యక్షురాలు మెట్ట లక్ష్మీ ప్రసన్న, వి.శ్రీనివాసు, బయ్యనగూడెం రజక నేతలు కోమటికుంట లక్ష్మణరావు, కోమటికుంట సుబ్బారావు, కుక్కిరిపాటి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు మహిళ ఇందిర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): భారతదేశ తొలి మహిళా ప్రధానిగా ఇందిరాగాంధీ పేదల సంక్షేమం, దేశాభివృద్ధికి పాటుపడ్డారని, ఆమె ఉక్కు మహిళ అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్ రావు అన్నారు. ఇందిరాగాంధీ 107వ జయంతి కార్యక్రమం ఏలూరు జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు.

పెంచిన విద్యుత్ చార్జీలను వ్యతిరేకించాలి



మర్చంట్స్ చాంబర్ అధ్యక్షుడు రాజేంద్రకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వ్యతిరేకించాలని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సెక్రటరీ బండి వెంకటేశ్వరరావు, సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు జి.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం స్థానిక మర్చంట్ చాంబర్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల రాజేంద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి ఏపీఈఆర్సీ పెంచిన విద్యుత్ చార్జీలపై వినియోగదారుల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టిందని, దీనికి జిల్లాలోని వర్తక వాణిజ్య సంఘాలన్నీ అభ్యంతరం తెలియజేస్తూ మెయిల్స్ పంపించాలని రాజేంద్రను కోరారు. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల ముందు తాము అధికారంలోకొస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చి, నెరవేర్చడంలేదని విమర్శించారు. మొదటిదఫా రూ.6072 కోట్లు, రెండో దఫా రూ.11,820 కోట్లు కలిపి రూ.18 వేల కోట్ల విద్యుత్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రజలపై కూటమి ప్రభుత్వం మోపుతుందని వివరించారు. తక్షణమే విద్యుత్ చార్జీలు పెంచే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. గౌతమ్ అదాని సంస్థకు చెందిన స్మార్ట్ మీటర్లను బలవంతాన వినియోగదారులపై రుద్దుతోందని విమర్శించారు. ప్రధాని స్మార్ట్ మీటర్లకు అయిన ఖర్చును కూడా వినియోగదారులు నుంచే వసూలు చేయడానికి ప్లాన్ చేశారని వివరించారు. స్మార్ట్ మీటర్లు అమలులోకొస్తే సాధారణ, మధ్యతరగతి ప్రజానీకం చాలా ఇబ్బందులు పడతారని తెలిపారు. సెల్ ఫోన్ రీచార్జ్ చేసుకున్న మాదిరిగానే ముందుగానే కరెంటుకు రీచార్జ్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేసిన విద్యుత్తు భారాలను వ్యతిరేకిస్తూ ఈనెల 24వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు ఏలూరులోని కాశీ విశ్వేశ్వర కళ్యాణ మండపంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా సదస్సును ప్రజలంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కళాశాల యాజమాన్యంపై ఫిర్యాదు



ఆర్ఐఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ధర్మాజీగూడెం శ్రీ ప్రతిభ కళాశాలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఐఓ చంద్రశేఖర్ బాబుకు పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఇ.శివ మాట్లాడుతూ లింగపాలెం మండలం ధర్మాజీగూడెంలోని శ్రీ ప్రతిభ రెగ్యులర్ జూనియర్ కళాశాలలో నాగార్జున యూనివర్సిటీకి సంబంధించిన డిస్టెన్స్ ఎగ్జామ్స్ ఈ నెల 17 నుంచి నిర్వహిస్తున్నారని తెలిపారు. అయితే ఒక రెగ్యులర్ కాలేజీలో డిస్టెన్స్ పరీక్షలు నిర్వహించాలంటే సంబంధిత అధికారి ఆర్ఐఓ అనుమతి ఖచ్చితంగా తీసుకోవాలని, ఐతే కళాశాల యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా పరీక్షలు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతిభ కళాశాల విద్యార్థులకు పక్కన ఉన్న శ్రీ సాయి కళాశాల భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారని, వీటిపై వెంటనే విచారణ నిర్వహించి ఆర్ఐఓ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కళాశాల వద్దే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సొంగ సునీల్ కుమార్, ముళ్లపూడి లారెన్స్, షేక్ అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో రాణించడం అభినందనీయం



విజేతలైన న్యాయవాదులతో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తంకుమార్

ఏలూరు (టూటౌన్): న్యాయవాదులు ఆటల్లోనూ రాణించడం అభినందనీయమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ అన్నారు. ఏలూరు బార్ అసోసియేషన్‌లో ఇంటర్నేషనల్ పురుషుల దినోత్సవ కార్యక్రమాన్ని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారామ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కోర్టులోని న్యాయవాదులకు వాలీబాల్, క్యారమ్స్‌లో పోటీలు నిర్వహించారు. ముగ్గురు సీనియర్ న్యావాదులను సన్మానించారు. ఆటల్లో విజేతలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం వృత్తిపరమైన ఒత్తిళ్లతో ఉండే న్యాయవాదులు ఆటవిడుపుగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.

విజేతలు వీరే..

వాలీబాల్‌లో పి.తంబి, రాజేష్, అశోక్, టి.వికాస్, లోహిత్, కె.యశ్వంత్, టి.కిరణ్, క్యారమ్స్‌లో కె.శ్రీకాంత్, నాగేశ్వరరావులు బహుమతులు అందుకున్నారు. సీనియర్ న్యాయవాదులు ఎంవీ నంద కుమార్, ఎస్‌వీఆర్ గాంధీ, సీఏపీఎస్‌లను సన్మానించారు. కార్యక్రమాల్లో పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



డీఈఓకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సహకరించాలని డీఈఓ ఎం వెంకట లక్ష్మమ్మను ఆంధ్రప్రదేశ్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. నూతనంగా ఏర్పడిన అసోసియేషన్ ప్రతినిధులు మంగళవారం డీఈఓను ఆమె కార్యాలయంలో మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు జీజేఏ స్టీవెన్ మాట్లాడుతూ స్కూలు పనివేళలో మార్పులు చేయరాదని, పాత సమయాలని కొనసాగించాలని, అపార్ నమోదు విషయంలో ప్రధానోపాధ్యాయులను ఒత్తిడికి గురి చేయకుండా, వెసులుబాటు కల్పించాలని ఉన్నతాధికారులకు నివేదించాలని డీఈఓను కోరారు. డీఈఓను కలిసిన వారిలో జిల్లా గౌరవ అధ్యక్షుడు ఉర్ల గంధర్వరావు, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కాటి వెంకట రమణ, తోట ప్రసాద్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాసగిరి శ్రీనివాసరావు, పిట్టా ఫెడరిక్ బాబు ఉన్నారు.

చట్టబద్ధ దత్తతపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీసీపీఓ సూర్యచక్రవేణి

ఏలూరు (టూటౌన్): చట్టబద్ధమైన దత్తత పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా బాలల సంరక్షణాధికారి సూర్యచక్రవేణి తెలిపారు. స్థానిక జాలిపూడి ఏరియాలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని స్పెషలైజ్డ్ అడాప్షన్ ఏజెన్సీ (శిశు గృహ) ద్వారా దత్తత కార్యక్రమాలను మిషన్ వాత్సల్యలో భాగంగా జరుగుతుంటాయన్నారు. నవంబర్ మాసాన్నంతటినీ దత్తత మాసోత్సవంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దత్తతకు అర్జీలు చేసుకునే తల్లిదండ్రులకు, మహిళా సంరక్షణ కార్యదర్శిలకు చట్టబద్ధమైన దత్తత నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎవరైనా వద్దనుకున్న తమ పిల్లలను ఊయల ప్రోగ్రాం ద్వారా లేదా 1098కి ఫోన్ చేసి సంరక్షించడానికి సమాచారం అందించాలన్నారు. డీసీపీయూ సిబ్బంది లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసరు, జాహ్నవి ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీకాంత్, శిశు గృహ మేనేజర్ భార్గవి, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కోఆర్డినేటర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.99.05 కోట్ల ధాన్యం కొనుగోలు

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఇప్పటి వరకు రూ.99.05 కోట్ల విలువైన 43,004.880 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైస్ మిల్లులకు తరలించామని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి తెలిపారు. క్వింటాలుకు కనీస మద్దతు ధర కామన్ రకం రూ.2,300, గ్రేడ్ ఏ రకం రూ.2,320 చొప్పున ధాన్యం కొంటున్నామని, రైసు మిల్లు తరలించిన 48 గంటల్లోపే రైతు అధార్ అనుసంధానిత బాంకు ఖాతాలో సొమ్ము జమయ్యేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ధాన్యం కొనుగోలుపై సందేహాలు, ఫిర్యాదులను జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్ (ఫోన్ నెంబర్లు 08812 – 230448, 77020 03584, లేదా టోల్ ఫ్రీ 18004256453)కు ఫోన్ చేయవచ్చన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	34
ఏలూరు –బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు – బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	12
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	35

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.45	4820	26
ఏలూరు – బీహెచ్ఈఎల్	21.15	4822	25
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	30
ఏలూరు–జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	27
ఏలూరు–బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు – బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	37
ఏలూరు – ఈసీఐఎల్	22.30	4814	29
ఏలూరు – తిరుపతి	16.00	4830	32

ఫైనాన్స్ రంగంలో ఉపాధి అవకాశాలపై అవగాహన



విజేతకు జ్ఞాపిక అందిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ప్రపంచ వ్యాపార రంగానికి ఆధునిక మేనేజ్‌మెంట్ పితామహుడు పీటర్ దృకర్ చేసిన సేవలు అమూల్యమని సీఆర్ఆర్ విద్యా సంస్థల పాలక మండలి సభ్యుడు కొండా హరిరామ కృష్ణంరాజు అన్నారు. సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం పీటర్ ద్రుకర్ 115వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. కళాశాలలో ఎంబీఏ ఫైనాన్స్ క్లబ్ ఆరంభించారు. ఫైనాన్స్ రంగంలో ప్రస్తుతం ఉన్న ఉపాధి అవకాశాలపై మేధ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సీనియర్ అకౌంటింగ్ ఎగ్జిక్యూటివ్ లావు రమేష్ విద్యార్థులకు అవగాహన కలిగించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు జ్ఞాపికలు, బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు, హెచ్ఓడీ కేవీ శ్రీధర్, కోఆర్డినేటర్ ఎస్ సతీష్ పాల్గొన్నారు.

మందులపై జీఎస్టీ ఎత్తివేయాలని చలో ఢిల్లీ



వాల్‌పోస్టర్ ఆవిష్కరించిన మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ నాయకులు

ఏలూరు (టూటౌన్): అత్యవసర – నిత్యావసర మందులపై జీఎస్టీని ఎత్తివేయాలని, మందుల ధరలు తగ్గించాలని ఈ నెల 22న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు పిలుపు నిచ్చారు. స్థానిక పవరుపేటలోని సీఐటీయూ కార్యాలయంలో చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను మంగళవారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు బీవీ సత్యనారాయణ, కార్యదర్శి మొహిద్దిన్‌లు మాట్లాడుతూ మెడికల్ రిప్రజెంటేటివ్స్‌కు 1976 ఎస్‌పీఈ యాక్ట్ ప్రకారం చట్టబద్ధమైన విధి విధానాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న నాలుగు లేబర్ కోడ్లను ఆపాలని, 44 కార్మిక చట్టాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.కిరణ్ కుమార్, ఎం ఉమా మహేష్, శివ గౌతమ్ చెన్నకేశవ, పృధ్వి, పవన్ ఆంథోని, డిసొజ తదితరులు పాల్గొన్నారు.